మా కలం.. మీ గళం..

# మన గళం

RNI : APTEL/ 2017/74310

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 08    సంచిక : 134    మంగళవారం    04 - 11 - 2025    పేజీలు: 8    వెల: 4

## ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి



3లో..

# సీసీఐ కేంద్రంలో సాంకేతిక లోపం ?

- పెంచికలపాడుకు పత్తిని విక్రయించేందకు వచ్చిన పత్తి రైతులు
- స్లాట్ డేట్ ఇవ్వలేదన్న అధికారులు... తమకు మేసేజ్ వచ్చిందన్న అన్నదాతలు
- కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డు పై బైఠాయింపు
- కర్నూలు ఎంపీ చొరువతో తీరిన సమస్య
- ఎంపీ బస్తిపాటి నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపిన పత్తి రైతులు



మనగళం, గూడూరు : గూడూరు మండల పరిధిలోని పెంచికలపాడు సీసీఐ కేంద్రంలో నెలకొన్న సాంకేతిక లోపం మూలంగా రైతులకు ఇబ్బందులు పడ్డారు. అయితే అటుగా వెళ్తున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు చొరువతో సమస్య తీరింది. వివరాలు ఇలా ఉన్నాయి. సీసీఐ ద్వారా ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు కలిపిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ క్రాప్ లో నమోదు చేసుకొని, కాపస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకున్నారు. స్లాట్ లో సోమవారం డేట్ రావడంతో పత్తిని అమ్ముకోవడానికి రైతులు గూడూరు మండలం పెంచికలపాడు లోని సీసీఐ కేంద్రానికి తీసుకోచ్చారు. అయితే స్లాట్ డేట్ వచ్చినట్లు తమకు వివరాలు రావంటూ అక్కడి అధికారులు చెప్పడంతో రైతులు అయోమయానికి గురయ్యారు. తమకు స్లాట్ బుక్ అయినట్లు మెసేజ్ లు వచ్చినందనే పత్తిని అమ్ముకునేందుకు వచ్చామని రైతులు తేల్చిచెప్పారు. అయితే అధికారులు ససేమిరా అన్నారు. పత్తిని వెనక్కు తీసుకెళ్లాలని సూచించడంతో రవణా ఖర్చులు భారం అవుతాయని రైతులు విన్నవించారు. ఈనేపథ్యంలో అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అసహనానికి గురైన రైతులు తమ పత్తి దిగుబడులు కొనుగోలు చేయాల్సిందేనంటూ రోడ్డుపై బైఠాయించి



2 లో..

## చేవెళ్ల బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ సంతాపం

- మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటింపు



మన గళం, న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో జరిగిన ప్రాణ నష్టం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయం అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు.

## దేశంలో క్రైస్తవుల హత్యలపై ట్రంప్ తీవ్ర ఆందోళన





మన గళం డెస్క్ : నైజీరియాలో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల విషయంలో అమెరికా తీవ్రంగా స్పందించింది. ఆ దేశంలో ఉగ్రవాదులను ఏరివేసేందుకు అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వైమానిక దాడులు లేదా నేరుగా అమెరికా బలగాలను పంపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన కీలక సంకేతాలు ఇచ్చారు. ఆదివారం ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో తిరిగి వస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. నైజీరియాలో రికార్డు స్థాయిలో క్రైస్తవులను చంపుతున్నారని, దీనిని

2 లో..

## చేవెళ్ల ప్రమాదం బాధాకరం



- మృతుల కుటుంబాలకు సానుభూతి: సీఎం చంద్రబాబు

మన గళం, అమరావతి :

తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల మండలంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలచి వేసింది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పలువురు ప్రయాణికుల మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గాఢ సంతాపం తెలిపారు. "మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. తీవ్ర

2 లో..

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేస్తాం


- ప్రపంచంలో ఎక్కడా లేని టెక్నాలజీతో పనులు
- టన్నెల్ పూర్తయితే తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం
- మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదు?
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు (ఎస్ఎల్‌బీసీ)లో సొరంగ మార్గంలో పనులను ఎలాంటి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి తీరుతాయని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యాధునిక టన్నెల్ టెక్నాలజీతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ మేర కు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లిలో హెలీ మాగ్నేటిక్ సర్వేకు సంబంధించిన సర్వే హెలికాప్టర్‌తో పాటు... అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న వివరాలు, అందుకు సంబంధించిన పరికరాలను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పరిశీలించారు. దీంతో పాటు టన్నెల్‌లో చేపట్టబోయే పనులకు సంబంధించి వివరాలను అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనుల పునరుద్ధరణలో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే వివరాలను ముఖ్యమంత్రి, మంత్రుల బృందానికి సంబంధిత అధికారులు తెలిపారు. ఈ సర్వే నేషనల్ జియోఫిజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని...హెలికాప్టర్‌కు ప్రత్యేకంగా అమర్చిన ట్రాన్స్‌మీటర్‌తో సర్వే

2 లో..

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం హెచ్చరిక



మన గళం, న్యూఢిల్లీ : ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో వాయు కాలుష్యం తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా లిఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌ను కఠినంగా ప్రశ్నిస్తూ, ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ సమర్పించాలని ఆదేశించింది. "పరిస్థితి దిగజారిన తర్వాత స్పందించడం కాదు, ముందుగానే సిద్ధం కావాలి" అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. వాయు కాలుష్య నియంత్రణలో నిర్వాహక వ్యవస్థ ముందస్తు ప్రణాళిక లేకుండా పనిచేస్తోందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విచారణలో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ తెలిపారు. దీపావళి అనంతరం ఢిల్లీలోని వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల్లో చాలా

2 లో..

# హిందుజా గ్రూప్‌తో రూ.20 వేల కోట్ల ఒప్పందం

- ఏపీకి పరిశ్రమల ఊపు - ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశ్రమల అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో మరో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు హిందుజా గ్రూప్ మధ్య రూ.20,000 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన అవగాహన ఒప్పందం సంతకం చేయబడింది. ఈ ఒప్పందం సంతకం కార్యక్రమంలో హిందుజా గ్రూప్ ఛైర్మన్ అశోక్ పి. హిందుజా, యూరప్ ఛైర్మన్ ప్రకాశ్ హిందుజా, హిందుజా ఇన్వెస్ట్మెంట్స్ ప్రాజెక్ట్ సర్వీసెస్ లిమిటెడ్ సీఈఓ వివేక్ నందా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం

2 లో..



# దేశంలో క్రైస్తవుల హత్యలపై ట్రంప్ తీవ్ర ఆందోళన

తాము ఎంతమాత్రం అనుమతించబోమని అన్నారు. సైనిక చర్యకు సిద్ధంగా ఉండాలని తన దళాలను ఆదేశించినట్లు వెల్లడించారు. "నా మదిలో చాలా ప్రణాళికలు ఉన్నాయి. వారు నైజీరియాలో క్రైస్తవులను రికార్డు సంఖ్యలో హత్య చేస్తున్నారు. అలా జరగడానికి మేము అంగీకరించం" అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన 'ప్రత్యేక ఆందోళన కలిగించే దేశాల' జాబితాలో నైజీరియాను చేర్చినట్లు ట్రంప్ గుర్తుచేశారు. మత స్వేచ్ఛను తీవ్రంగా ఉల్లంఘిస్తున్న దేశాలను ఈ జాబితాలో చేర్చుతారు. నైజీరియాతో పాటు చైనా, రష్యా, పాకిస్థాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు కూడా ఇందులో ఉన్నాయి. నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను రక్షించడంలో విఫలమైతే కఠిన చర్యలు తప్పవని గతంలోనే ఆయన హెచ్చరించారు. అమెరికా హెచ్చరికలపై నైజీరియా కూడా స్పందించింది. ఇస్లామిక్ ఉగ్రవాదులతో పోరాడటానికి అమెరికా సహాయాన్ని స్వాగతిస్తామని, అయితే తమ దేశ ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరింది. నైజీరియాలో క్రైస్తవులు, ముస్లింల మధ్య ఘర్షణలు 1950ల నుంచి కొనసాగుతున్నాయి. ముఖ్యంగా 2009 తర్వాత బోకో హరామ్, ఫులానీ పశువుల కాపరులు వంటి రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు క్రైస్తవ గ్రామాలను, చర్చిలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నాయి. నివేదికల ప్రకారం, ఈ హింసలో ఇప్పటివరకు 45,000 మందికి పైగా క్రైస్తవులు ప్రాణాలు కోల్పోగా, వేలాది చర్చిలు ధ్వంసమయ్యాయి.

# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం హెచ్చరిక



వాటి కార్యకలాపాలు నిలిచిపోయాయని. మొత్తం 37 మానిటరింగ్ కేంద్రాల్లో కేవలం 9 మాత్రమే నిరంతరాయంగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ కేంద్రాలు సక్రమంగా పని చేయకపోతే, గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమలు సమయాన్ని నిర్ణయించడం అసాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో, ఇప్పటికే చేపట్టిన చర్యలు, ప్రతిపాదిత ప్రణాళికలపై వివరాలతో కూడిన నివేదికను వెంటనే సమర్పించాలని కోర్టును ఆదేశించింది. కాలుష్యం నియంత్రణ ఏజెన్సీలు "ప్రతిస్పందనాత్మకంగా కాకుండా, ముందస్తు చర్యలు తీసుకునే విధంగా" పనిచేయాలని స్పష్టం చేసింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తరపున న్యాయవాదులు, గాలి నాణ్యత డేటా సేకరణ బాధ్యత తమదేనని వివరించారు. అన్ని సంబంధిత ఏజెన్సీలు త్వరలో నివేదికలు సమర్పిస్తాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు హామీ ఇచ్చారు.

కోర్టు గతంలో కూడా స్పష్టంగా పేర్కొన్నదే "కాలుష్యం పెరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కాదు, దానిని అడ్డుకోవడం కోసం ముందస్తు ఏర్పాట్లు అవసరం." గత నెల దీపావళి సందర్భంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పరిమిత స్థాయిలో గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి కోర్టు అనుమతి ఇచ్చింది. పర్యావరణ పరిరక్షణ, సాంప్రదాయ ఉత్సవాల మధ్య సమతుల్యత అవసరమని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. గ్రీన్ క్రాకర్స్ విక్రయాలు అక్టోబర్ 18 నుంచి 20 మధ్య మాత్రమే జరగాలనీ, నిర్ణీత సమయాల్లోనే వాటిని కాల్చేందుకు అనుమతి ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ సడలింపును టెస్ట్ కేస్ ప్రాతిపదికన ఇస్తున్నామని కూడా పేర్కొంది. అదే సమయంలో, అక్టోబర్ 14 నుంచి 25 వరకు గాలి నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, రోజువారీ నివేదికలను కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులు సమర్పించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో, ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై ప్రభుత్వ యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

# హిందుజా గ్రూప్‌తో రూ.20 వేల కోట్ల ఒప్పందం

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల రంగానికి, స్వచ్ఛ ఇంధన అభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని తెస్తుందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఉన్న 1,050 మెగావాట్ల హెచ్‌ఎన్‌పీసీఎల్ ప్లాంట్‌ను అదనంగా 1,600 మెగావాట్ల సామర్థ్యంతో విస్తరించనున్నారు. రాయలసీమ ప్రాంతంలో భారీ స్థాయిలో సౌర, వాయు విద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రం స్వచ్ఛ ఇంధన సామర్థ్యాన్ని మరింత బలపరచనుంది. అదే విధంగా, కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఆధునిక సాంకేతికతతో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్ ఏర్పాటు చేసి పచ్చపరిశ్రమల వృద్ధికి దోహదం చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, "హిందుజా గ్రూప్‌తో కుదిరిన ఈ ఒప్పందం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ పరిశ్రమల రూపురేఖలను మార్చనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా పరిశ్రమలు, ఉపాధి, పునరుత్పాదక ఇంధన రంగాల్లో రాష్ట్రం దేశానికి మోడల్‌గా నిలుస్తుంది" అని తెలిపారు.

ఈ ఒప్పందం రాష్ట్ర అభివృద్ధి దిశగా మరో గొప్ప మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీసీఐ కేంద్రంలో సాంకేతిక లోపం ?

నిరసన చేపట్టారు. అటుగా వెళ్తున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. రైతులతో పాటు సీసీఐ కేంద్రానికి వెళ్లి అక్కడి అధికారులను అడగగా సాంకేతిక లోపం కారణంగా ఇలా జరిగి ఉంటుందని తెలిపారు. అలాంటప్పుడు రైతులకు ఏదోరకంగా న్యాయం చేయాలి కదా అని ప్రశ్నించారు. సమస్య మా పరిధిలో లేదని అక్కడి అధికారులు తెలుపుడంతో ఎంపీ వెంటనే ఢిల్లీలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్.సిరికి సమస్యను వివరించారు. ఢిల్లీ అధికారులతోపాటు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి స్లాట్ బుక్ అయినట్లు మెసేజ్ లు వచ్చిన రైతులు పత్తిని కొనుగోలు చెయాలని పెంచికలపాడు సీసీఐ అధికారులను ఆదేశించారు. దీంతో రైతులు పత్తిని విక్రయించుకున్నారు. తమ సమస్యను పరిష్కరించిన ఎంపీ నాగరాజుకు పత్తి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేస్తాం

నిర్వహించడం జరుగుతుందని అధికారులు విశదీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టును 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మంది కి తాగునీరు నల్గొండ జిల్లాకు అందించాలని ప్రారంభించారని తెలిపారు. అప్పట్లో ప్రారంభించిన పనులు నిలిచిపోగా... తిరిగి 2004 అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్? రెడ్డి గుర్తు చేశారు. ఈ విషయంలో టన్నెల -వన్ 44 కిలోమీటర్లు, టన్నెల్-2 మూడు కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. అప్పట్లో ఇది టైగర్? రిజర్వు ఫారెస్టు అని...పులులను సంరక్షించి వాటికి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా పూర్తి చేయాలని అప్పట్లోనే నిర్ణయించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. టన్నెల్ బోర్ నిర్మాణం భారతదేశంలోనే మొదటిసారిగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు వినియోగించడం జరుగుతుందన్నారు. అప్పట్లో పది కిలోమీటర్ల టన్నెలను సైతం అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పూర్తి చేయాలేదని... కేసీఆర్, హరీష్? రావు ఈ ప్రాజెక్టును పక్కన పెట్టారని... అందుకు కారణం వారికి రావాల్సిన పర్సెంటేజీ రాదని చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ టన్నెల్ పూర్తయితే 30 టీఎంసీల నీటితో 3 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. ఈ టన్నెల్ ప్రస్తుతం రూ.4,600 కోట్లతో పూర్తయ్యేందుకు చర్యలు రూపొందించినట్లు తెలిపారు. రాయలసీమ పేరుతో నీటిని తరలించుకుపోతున్నారని...అప్పట్లో కేసీఆర్, హరీశ్ రావు సంతకాలు పెట్టి వచ్చారని ఆరోపించారు. 299 టీఎంసీలకు ఒప్పుకున్నట్లు ట్రిబ్యునల్‌లో అడగడానికి వీల్లేదని తెలిపారని ముఖ్యమంత్రి రేవంత్ ఒడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపిస్తున్నామని...ఒక కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసుగా మారిందని, ఈ విషయంలో కేసీఆర్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అత్యంత తక్కువ ఖర్చుతో 30 టీఎంసీల నీరు తీసుకెళ్ళే టన్నెల్ ఎక్కడా లేదని తెలిపారు. ఈ పనులు చేపట్టిన క్రమంలో ఎనిమిది మంది చనిపోయారని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిపుణులైన ఆర్మీ అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం 9.8 కిలోమీటర్లు టన్నెల్ పనులు కావాల్సి ఉందని, వీటిని మంత్రి వర్గంలో ఆమోదించడం జరిగిందన్నారు. ఈ విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు చిల్లరమాటలు మానేయాలని... ఇప్పటికైనా హరీశ్ రావు మారాలపి ఎద్దేవా చేశారు. టన్నెల్ లోపల చేసే పని క్రిటికల్ సిట్యూయేషన్ నేపథ్యంలో అందరితో సర్వేలు చేస్తున్నామన్నారు. అటవీ ప్రాంతంలో టన్నెల్ చేయడం ఎంతో ఇబ్బంది అయినప్పటికీ తప్పకుండా పూర్తి చేసి తీరుతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి స్పష్టమైన హామీనిచ్చారు. అలాగే గిరిజనులకు న్యాయం చేస్తామన్నారు. అన్ని తండాల వారికి డిసెంబరు 31వ తేదీలోగా సమస్యలను పరిష్కరించే బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. తనతోపాటు మంత్రులు ఇక్కడివారేనని, ఇప్పుడు పూర్తి చేయకుంటే ఎప్పటికీ కాదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ టన్నెల్ పూర్తి చేయడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా పూర్తి చేసేందుకు అందరి సహకారం తీసుకుంటామన్నారు. ఈ విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎంతో శ్రమపడ్డారని గుర్తు చేశారు. టన్నెల్ బోర్డు ఏరియల్ సర్వేలో పూర్తి వివరాలు తెలియడం జరుగుతుందని.. ఈ సర్వేతో టన్నెల్ తవ్వే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుస్తాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఈ పనులు 20 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నా గత ఐదేళ్ళ క్రితం ప్రారంభమయ్యాయన్నారు. అందరి దృఢ సంకల్పంతో రెండేళ్ళలో ఎస్?ఎల్?బీసీ టన్నెల్? పూర్తి చేయాలని ముందుకెళ్తున్నాం అన్నారు. ఈ టన్నెల్ పూర్తయితే శ్రీశైలం ప్రాజెక్టు కంటే ఎక్కువగా నీరు వచ్చి ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. అలాగే గతంలో ఎస్?ఎల్?బీసీ పనుల్లో ఎనిమిది మందిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యాధునికమైన హెలిబోన్ ఎలక్ట్రిక్ టెక్నాలజీ ద్వారా 44 కిలోమీటర్ల వరకు హెలీకాప్టర్ ద్వారానే జరుగుతుంది. భారత ఏరియల్ ఎలక్ట్రికల్ మ్యాగ్నెటిక్ సర్వే ఎక్కడా నిర్వహించలేదు... ఇక్కడే ప్రథమం... అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో తిరిగి ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వేకు టన్నెల్ కొలాప్స్ అయిన సమయంలో భారతదేశంలోనే టన్నెలింగ్ మెథడ్‌లో ఎక్కువ నైపుణ్యం ఉన్న వారిని ఎంచుకొని భారత సైన్యానికి ఇంజనీరింగ్ చీఫ్ అయిన జనరల్ హరిపాల్ సింగ్, ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ ... ఎంతో పేరు ప్రఖ్యాతులుగాంచిన వారిని తెలంగాణకు డిప్యూటేషన్‌పై తీసుకొని ఈ పనులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్నో కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్? కుమార్? రెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం వచ్చిన తర్వాత తానే ఎస్?ఎల్?బీసీ టన్నెల్? ప్రాజెక్టు ద్వారా నల్గొండ జిల్లాను ఫ్లోరైడ్? నుంచి కాపాడాలని ఎన్నోసార్లు మాట్లాడినట్లు గుర్తు చేశారు. ఈ విషయంలో ఎస్?ఎల్?బీసీ గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి అడగకుండానే ఎంత ఖర్చయినా పూర్తి చేయాలని సంకల్పించారని, ఇది ఆనందకరమన్నారు. మూడు లక్షల ఎకరాలతో పాటు... ఫ్లోరైడ్? లేకుండా చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి చేసిన ఈ కార్యక్రమం ... తాను ఇరిగేషన్? మంత్రిగా ఉండటం తనకు ఎంతో గర్వకారణమని తెలిపారు. వికారాబాద్? నుంచి ప్రారంభమయ్యే మూసీనదిని మంచిగా చేసేందుకు కూడా ఖర్చుకు వెనకాడకుండా ప్రభుత్వం పని చేస్తుందని, ఈ విషయంలో జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ వర్షాల వల్ల నష్టపోయిన తండావాసులకు నష్టపరిహారం అందించాలని కోరారు. అనంతరం సర్వే నిర్వహించే ప్రత్యేక హెలీకాప్టర్ ముందుగా వెళ్ళి సర్వే నిర్వహించగా... ముఖ్యమంత్రి, మంత్రుల బృందం మరో హెలీకాప్టర్?లో సర్వే హెలీకాప్టర్? వెంట వెళ్ళారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఐజీ చౌహన్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల ప్రమాదం బాధాకరం

గాయాలతో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను" అని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం గాయపడిన వారిని కాపాడేందుకు పూర్తి సహకారం అందించాలని, వైద్య సేవల్లో ఎటువంటి లోపం చోటు చేసుకోకూడదని ఆయన ఆకాంక్షించారు. చేవెళ్ల రోడ్డు ప్రమాదం రాష్ట్ర ప్రజలను విషాదంలో ముంచెత్తిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

## బిజెపి ఆధ్వర్యంలో హిందూ సంఘాల నిరసన



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని కోడుమూరు తాలూకా పోలీస్ స్టేషన్లో బిజెపి ఆధ్వర్యంలో హిందూ సంఘాల ధర్నా నిర్వహించారు కొందరు ఆకతాయిలు దేవుళ్లకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని వాటి వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూర్ టౌన్ జె కె ఎల్ ఎస్ చికెన్ షాపుకు చెందిన కటిక శేషావలి అనునతడు కర్నూలు జిల్లాలోని పశ్చిమ దిశన ఉన్న శ్రీ ఉరుకుంద స్వామి వీరన్న గురించి ఆయనను కొలిచే భక్తుల గురించి అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడుచూ హిందువుల మనోభావాలు దెబ్బ తినే విధంగా స్వామి గురించి దుర్భాషలాడాడని హిందూ దేవతల చిత్రపటాలను నేలపై వేసి తొక్కుతున్న వీడియోలను షేర్ చేయు లాంటివి చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించాడని ఈ సందర్భంగా వారు తెలియజేశారు అతనిపై చాలామంది ఫిర్యాదు చేయడం వల్ల కోడుమూరు ఎస్సై శ్రీ డివైస్ స్వామి కేసు నమోదు చేసి విచారణ చేపడతానని తెలియజేశారు ఇలా ఎవరు పడితే వారు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక ఉరుకుంద ఈరన్న స్వామి భక్తులు మరియు ఉరుకుంద యాదవ్ గోపాల్ నాయుడు మహేష్ నాయుడు తాయప్ప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# కుష్టి వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**




మనగళం, కర్నూలు సిటీ : సమష్టి కృషితో కుష్టి వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం అమలుకు సంబంధించి జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలు, అపోహల గురించి అవగాహన కల్పించి, జిల్లాలో కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈనెల 17వ తేదీ నుండి నవంబర్ 30వ తేదీ వరకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపయిన్ (ఎల్ సీడీ) నిర్వహిస్తున్నామన్నారు. 14 రోజులపాటు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అందరినీ పరీక్షించాలని, కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి తక్షణమే వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. అలాగే కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవ అందించడం ద్వారా వ్యాధిని అరికట్టి, అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలియజేశారు. కాబట్టి జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో 02 నుండి 06 సంవత్సరాల వయసు పిల్లలకు, అన్ని పాఠశాలలో పిల్లలను, అలాగే సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు కుష్టువ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించి , వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీ.బి. అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్....... కుష్టు వ్యాధి లక్షణాలను వివరించారు. మల్టీ డ్రగ్ థెరపీ చికిత్స ద్వారా కుష్టు వ్యాధి త్వరగా నయం అవుతుందని తెలిపారు. ఈ మందులు ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. 2027 నాటికి కుష్టు రహిత దేశంగా మారుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా సమన్వయ కమిటీ సభ్యుల సమక్షంలో కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని తెలియజేసే గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ పి లీనారెడ్డి, టి. హెచ్ వార్డు వైద్య అధికారి రెడ్డి బాబు, పి.టి , డిప్యూటీ పారామెడికల్ అధికారులు, టి. చంద్రశేఖర్ రెడ్డి, వై. సుబ్రహ్మణ్యం, జిల్లా కుష్టు నివారణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి



**– జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

మనగళం, కర్నూలు సిటీ : ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకూడదని, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీ వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి రోజు లాగిన్ ఓపెన్ చేసి, అర్జీ దారులతో కింది స్థాయి సిబ్బంది కాకుండా జిల్లా అధికారులే ఓపిగ్గా మాట్లాడి, వివరాలు తెలుసుకొని పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. రీఓపెన్ కాకుండా సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీ ని గడువు దాటే వరకు పరిష్కరించకుండా ఉండకూడదన్నారు. ఆడిట్ ప్రక్రియ వంద శాతం చేయాలని, సీఎం వో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి




మనగళం, కర్నూలు సిటీ : అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ. 20వేల కోట్లు కేటాయించి, పెండింగ్ ఉన్న వేదవతి గుండ్రేవుల ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ జిల్లా వ్యాప్త ఆందోళనలో భాగంగా కర్నూల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బి నాగరాజు అధ్యక్షత వహించగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇ శ్రీరాములు కె శ్రీనివాసులు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఒకప్పటి ఆంధ్ర రాష్ట్ర రాజధాని పాలకుల నిర్లక్ష్యం మూలంగా దేశంలోనే అత్యధిక వెనుకబడిన జిల్లా కర్నూలు అని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ఎన్నికలకు ముందు సాగునీటి ప్రాజెక్టులు గుర్తొస్తాయి తప్పా అధికారం చేపట్టాక ఏ మాత్రం ఉండవని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం హాయంలో వేదవతి ప్రాజెక్టు పనులు ప్రారంభించినప్పటికీ ప్రయోజనం శూన్యం అన్నారు. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, అయితే తాము అధికారంలోకి వస్తే వేదవతి గుండ్రేవుల ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని కూటమి నేతలు విస్మరించారని ఆరోపించారు. పార్టీలు మారడానికి, అధికారం చేపట్టడానికి రాజకీయ నాయకుల ప్రాజెక్టులు ఉపయోగించుకుంటున్నారే తప్పా ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. కూటమి పెద్దలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ప్రకారం పత్తికొండలో టమోటా జ్యూస్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని, ఎమ్మిగనూరులో టెక్స్ టైల్స్ పరిశ్రమను, ఆలూరులో జింకల పార్కును, ఆదోనిలో మూతబడిన పరిశ్రమలను తెరిపించాలని, ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ లో ఏర్పాటయ్యే నూతన పరిశ్రమలలో స్థానిక యువతకే 75 శాతం ఉద్యోగ అవకాశాలు ఇచ్చే జీవో విడుదల తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు శ్రీకాంత్, చంటి, అఖిల్, కృష్ణ, సురేంద్ర యాదవ్, రసూల్, నాగేశ్వరరావు, ప్రభాకర్, కాసిం, వీరయ్య, రాజ్ కుమార్, గౌస్ ప్రశాంత్, అంజి , శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి



మనగళం, కర్నూలు సిటీ : విభిన్న ప్రతిభావంతులు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు టచ్ ఫోన్, వీల్ చైర్ లు, ట్రాన్స్ జెండర్ లకు గుర్తింపు కార్డులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రయిస్ ఫాతిమా పాల్గొన్నారు.

# అక్రమ వసూళ్లను అరికట్టాలి




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అక్రమ రుసుము వసూళ్లను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ ప్రస్తుతం ఎమ్మిగనూరు మార్చని సోమప్ప పాఠశాలలో ఆ పాఠశాలలో సుమారు 3,600 మంది విద్యార్థినీలు చదువుతున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం 2025%-%26 లో కొత్తగా చేరిన 850 మంది విద్యార్థినీల దగ్గర ప్రతి ఒక్కరి వద్ద నుంచి రూ.150 చొప్పున ఎలాంటి రశీదు లేకుండా వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. , అలాగే గత సంవత్సరం (2024%-%25)లో 10వ తరగతి పూర్తి చేసుకున్న 700 మంది విద్యార్థుల నుంచి బదిలీ సర్టిఫికెట్ (టీసీ) ఇచ్చేందుకు రూ.100 చొప్పున మొత్తం రూ.1,97,500 వసూళ్లు చేశారని ఆరోపించారు. తక్షణమే విద్యార్థుల నుంచి వసూళ్లు చేసిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని, ప్రధానోపాధ్యాయుడు కె. కృష్ణమూర్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో కలసి ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీవాసులు, అమర్, అంజి పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్జివి కృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పీజీఆర్యస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 28 అర్జీలు రాగా, వాటిని చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ అర్జీదారులకు హామీనిచ్చారు. జగన్నాథ గట్టుపై ఉన్న ఎన్టీఆర్ కాలనీ టిడ్కో గృహాలకు సంబంధించి 365 చదరపు అడుగుల గృహానికి రూ.25,000/- లు, 430 చదరపు అడుగుల గృహానికి రూ.50,000/- చెల్లించాల్సి ఉంటుందని, సగం నగదు చెల్లించిన లబ్దిదారులు పూర్తిగా చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని టిడ్కో అధికారి పెంచలయ్య పేర్కొన్నారు. పూర్తి రుణం పొందిన లబ్దిదారులు నగరపాలక కార్యాలయంలో ఫోటో, ఆధార్ కార్డు ఇవ్వాలని సూచించారు. త్వరలో గృహాలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పెంచలయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్ఓ స్వర్ణలత, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, సిఎంఎం భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కుర్నూలు జిల్లాకు చేరుకున్న నూతన మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ – ఎయిడ్స్ నియంత్రణ అండ్ నివారణా విభాగం ఆధ్వర్యంలో సోమావారం కర్నూలు కలెక్టరేట్ లో కలెక్టర్ డాక్టర్.ఏ. సిరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హైరిస్క్ ప్రాంతాలకు వెళ్ళి పరీక్షలు చేసేలా ప్రణాళికా తయారు చేయాలని సంబంధిత అధికారాలకు సూచించారు. ప్రతిఒక్కరూ హెచ్ఐవీ పరిస్థితిని తేలుసుకోవాలని, అదేవిధంగా అన్ని రకాల రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రజలను చైతన్య పరిచి ఎయిడ్స్ రహిత కర్నూలు జిల్లాగా మారుద్దామని పిలుపునిచ్చారు. ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్ మాట్లాడుతూ ఈ మొబైల్ వాహనం ద్వారా హెచ్ఐవీ/ ఎయిడ్స్, సుఖ వ్యాధులు పై అవగాహన కలిపించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యా క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఆసుపత్రుల సమన్వయం అధికారి డాక్టర్.యస్. జఫరుల్లా, జిల్లా మలేరియా అధికారి ఏ.నూకరాజు, ఏపీ సాక్స్ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, క్లస్టర్ పీఓ రాజ్యలక్ష్మీ, గణాంక అధికారి దేవి శంకర్ గౌడ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భారత మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు

**– కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు**



మనగళం, కర్నూలు సిటీ : మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా జట్టు పై భారత జట్టు విజయం సాధించడంతో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. భారత మహిళా క్రికెటర్లను అభినందిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫైనల్ మ్యాచ్ లో మనవాళ్లు అద్భుతంగా ఆడి చిరస్మరణీయ విజయం సాధించి ప్రపంచ కప్ ను గెలుచుకున్నారని అభినందనలు తెలిపారు. గతంలో రెండు సార్లు ప్రపంచ కప్ ఫైనల్ కు చేరినప్పటికీ విజయం సాధించలేకపోయిన మన జట్టు, ఈ సారి కప్ గెలిచి కోట్లాది మంది దేశ ప్రజల్లో ఆనందం నింపిందన్నారు..ఈ విజయం స్పూర్తి తో ముందు ముందు మరెన్నో విజయాలను సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి

**– జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రకృతి వ్యవసాయం తో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, ప్రజారోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం ఏ క్యాంప్ లో ఉన్న ఉద్యానవన భవనంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ట్రైనీ ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లకు 5 రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం అంటే తనకు చాలా ఇష్టమని, పదవీ విరమణ అనంతరం తాను వ్యవసాయం చేస్తానని కలెక్టర్ తెలిపారు. వైజాగ్ లో తాను జాయింట్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో సహజ వ్యవసాయం ఎక్కువగా అరకు, పాడేరు ప్రాంతాలలో బాగా ప్రోత్సహించడం జరిగిందన్నారు. సహజ వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులు చాలా కాలం నాణ్యతతో ఉంటాయన్నారు. అంతే కాకుండా సహజ వ్యవసాయం ద్వారా ఆదాయం ఖచ్చితంగా వస్తుందన్నారు. ప్రజలందరూ ఆహారం కొరకు రైతుల మీద ఆధారపడి ఉంటారని, రైతులు పంటను పండించడానికి భూమి మీద ప్రకృతి మీద ఆధారపడి ఉంటారన్నారు. అటువంటి భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతుల మీద ఉందన్నారు. రసాయన ఆధారిత వ్యవసాయ పద్ధతుల వలన నేల సారవంతం తగ్గిపోతుందని, సహజ వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తోపాటు రైతులు తక్కువ వ్యయంతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. తాను కర్నూలు జిల్లాకు వచ్చి కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉల్లి సమస్యను ఎదుర్కోవడం జరిగిందన్నారు. గత సంవత్సరం ఉల్లికి డిమాండ్ బాగా వచ్చి ధర బాగా వచ్చిందని, అందువల్ల ఈ సారి కూడా ఉల్లి పంట ఎక్కువగా సాగు చేశారన్నారు. ఉల్లి పంటను రైజ్డ్ బెడ్స్ పద్ధతిలో సాగు చేయాలని, ఈ విధానం ద్వారా భారీ వర్షాలు , నీటి నిల్వల కారణంగా పంట నష్టం జరగకుండా ఉంటుందన్నారు. ఈ పద్ధతిలో సాగు చేయనందున రైతులు ఉల్లి పంట నష్టం ఎదుర్కోవల్సి వచ్చిందన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు విత్తనాలు ఏ విధంగా వాడాలి అనే విషయాలను చెబుతున్నారని, రైతులు జాగ్రత్తగా శ్రద్ధగా సూచనలు విని వాటిని పాటించాలన్నారు. రైతులు ఒకటే పంట రకం వేయకుండా 2, 3 రకాలు సాగు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. అంతే కాకుండా పాడి పశువులను పెంచుకొని ఆదాయం మరింత పెంచుకోవాలన్నారు. పాడి పశువుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం రుణాల అవకాశం కూడా కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఇంచార్జి ఉద్యాన శాఖ అధికారి మదన్ మోహన్ గౌడ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సాలు రెడ్డి, ఏపీసిఎన్ఎఫ్ డీపీఎమ్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

# 23న భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు



మనగళం, కర్నూలు సిటీ : గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న భగవద్గీత కంఠస్థ పఠణ పోటీలలో భాగంగా ఈ సంవత్సరం నంద్యాల జిల్లాకు సంబంధించి ఈనెల 23వ తేదీన డోన్ పట్టణంలోని శ్రీసుధా విద్యాసంస్థల నందు పోటీలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మకర్తల మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి కర్నూలు నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానములు కళ్యాణ మండపంలో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుండే భగవద్గీత నేర్పడం వల్ల విద్యార్థులలో నైతిక విలువలు పెరగడంతోపాటు, మనోధైర్యం కూడా పెరుగుతుందని అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు "ప్రతి ఇంటా భగవద్గీత – ప్రతి నోటా భగవద్గీత" అని సంకల్పించుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం పోటీల విధివిధానాలు మూడు విభాగాలుగా నిర్వహించనున్నారని, 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగము మొత్తం 27 శ్లోకాలు,10వ తరగతి మరియు ఇంటర్ విద్యార్థులకు 16వ అధ్యాయము దైవాసుర సంపద్విభాగయోగము మొత్తము 24 శ్లోకాలు,18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు వారికి "నిత్యజీవితంలో భగవద్గీత – భావ విశ్లేషణ" అనే అంశంపై ఈ పోటీలు నంద్యాల జిల్లాకు, కర్నూలు జిల్లాకు విడివిడిగా పోటీలు నిర్వహించబడునని చెప్పారు. త్వరలో కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న పోటీల తేదీని ప్రకటించనున్నామని తెలిపారు. ప్రతి విభాగం నుండి విజేతలను గుర్తించి ప్రథమ బహుమతి రూ.1,116 , ద్వితీయ బహుమతి రూ.816 , తృతీయ బహుమతి రూ.516 అందించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, కళ్యాణ మండపం మేనేజర్ రామ్మోహన్ రెడ్డి, ప్రసాద్, విశ్వహిందూ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి, లలితకళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య, మద్దికుంట రాంభూపాల్ రెడ్డి, ఆవోపా నాగేశ్వరరావు, గోదాగోకులం బృందం, తరిగొండ వెంగమాంబ సేవాసమితి పి. నీలిమ, యోగామాష్టర్ బి. జయలక్ష్మి, శ్రీరామపట్టాభిషేక మహోత్సవ సమితి ప్రతినిధులతో పాటు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

# ఉలిందకొండలో ప్రభుత్వ భూములు కాపాడాలి



మనగళం, కల్లూరు : కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలోని ప్రభుత్వ భూములు, చుక్కల భూములు, ఇనాం భూములను కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం సునయన ఆడిటోరియం లో కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ అట్టాడ సిరికి రాయలసీమ ఉద్యమ యువ నాయకుడు,కర్నూల్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సీమ కృష్ణ రాథోడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉలిందకొండ గ్రామంలో ప్రభుత్వ భూములను రెవెన్యూ శాఖ అధికారులు, భూకబ్జాదారులు కుమ్మక్కై కబ్జాలు పాల్పడుతున్నారని ఆరోపించారు.అదే విధంగా ఉలిందకొండలో భూముల ధారాదత్తం చేసి బినామీ పేర్లతో ఆన్లైన్ మాయాజాలం చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేస్తాం

**– కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**




మనగళం, కర్నూలు క్రైం : కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 97 వినతులు వచ్చాయని పోలీసు అధికారులు తెలిపారు.


ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేశారు

కర్నూలు , మిలిటరీ కాలనీ దగ్గర ఉన్న కరెంట్ సబ్ స్టేషన్ ఆఫీసులో ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నంద్యాలకు చెందిన దుర్గప్రసాద్ డబ్బులు తీసుకొని మోసం చేశాడని కర్నూలు మండలం , నూతన పల్లెకు చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. నాకు ఇవ్వాల్సిన రూ. 1 లక్ష 80 వేలు ఇప్పించాలని కోరారు. నా హోండా షైన్ ద్విచక్ర వాహనం ను కర్నూలు ఔట్ డోర్ స్టేడియం దగ్గర దొంగలించారని, న్యాయం చేయాలని కర్నూలు మండలం, ఈ. తాండ్రపాడు గ్రామానికి చెందిన బొల్లెద్దుల వెంకటసాయి క్రిష్ణ ఫిర్యాదు చేశారు. నా పొలంలో పండించిన 220 ప్యాకెట్ల పత్తి ని ఎత్తుకెళ్ళిన వారి పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని దేవనకొండ మండలం, ఆలారు దిన్నె గ్రామంకు చెందిన వీరభద్ర ఆచారి ఫిర్యాదు చేశారు. కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లో పని చేస్తున్న మా అమ్మ ఆచూకి తెలియడం లేదని ప్రకాశం జిల్లా , కంబం గ్రామానికి చెందిన సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ప్రేమ వివాహం చేసుకున్న తమకు రక్షణ కల్పించాలని కర్నూలు మండలం, ఈ . తాండ్రపాడు గ్రామానికి చెందిన రాజకుమారి జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. కర్నూలు షరాఫ్ బజార్ లో ఉన్న నగేష్, ప్రవీణ్ అనే వ్యక్తులు 22 తులాల బంగారం తాకట్టు పెట్టించుకుని రూ. 10 లక్షలు అప్పుగా ఇచ్చారు. వడ్డీతో సహా అప్పును తిరిగి చెల్లించడానికి వెళ్లగా షాపు మూసి ఉందని, ఇప్పటివరకు ఆచూకి తెలియడం లేదని కర్నూలు , అశోక్ నగర్ కు చెందిన రమేష్ ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు శివశంకర్, ఇబ్రహీం లు పాల్గొన్నారు.


# సూర్య నారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం రెండవ సోమవారం సందర్బంగా శ్రీ గౌరీ శంకర స్వామికి ప్రాతః కాలం నుండి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకము విశేష అర్చనలు నిర్వహించారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి శివునికి అభిషేకం చేశారు. అదేవిధంగా భక్తులు పెద్దఎత్తు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



# డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్




మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవాది కార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి. కబర్ధి సూచనల మేరకు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఎక్సైజ్ అధికారులతో సోమవారం జాతీయ లోక్ అదాలత్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కోర్టులలో పెండింగ్ ఉన్న కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బి.లీలా వెంకట శేషాద్రి అధికారులకు సూచించారు. గవర్నమెంట్ జి. ఓ. 417 ప్రకారం కాంపౌండ్ ఎక్సైజ్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ ను డిసెంబర్ 13 వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో ఎక్కువ కేసులు పరిష్కరించేల ప్రత్యేక దృష్టి సారించి ఈ లోక్ అదాలత్ ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి. రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు మంజుల, చంద్రశేఖర్లు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ ముఖ్యమైనది

మనగళం, జీవితంలో విద్యార్థి దశ ముఖ్యమైనదని, చదువుతో పాటు వివిధ రంగాలలో ప్రావీణ్యత సాధించాలని, అప్పుడు చదువు సాఫీగా సాగిపోతుందని ప్రముఖ కంటివైద్య నిపుణురాలు డా.స్వాతి పేర్కొన్నారు. సోమవారం కర్నూలు రెవెన్యూ కాలనీ రవీంద్ర స్కూలులో జరిగిన బాలల దినోత్సవ బహుమతులను ఆమె అందజేశారు. కర్నూలు బాలోత్సవంవారు నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరిగి చలాకీగా ఉంటారన్నారు. వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ చాలా బాగుందన్నారు. విద్యార్థులు తమ తరగతి గదిలోనే చివరి బెంచిలో కూచొని బోర్డు పైన అక్షరాలు కనిపిస్తున్నాయా లేదా అని పరీక్షించుకోవాలని సూచించారు. శరీరంలో కళ్ళు ముఖ్యపాత్ర వహిస్తాయన్నారు. నెహ్రూ దార్శనికత గల నాయకుడని ఆయన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తీసుకొచ్చిన ప్రణాళికలు దేశానికి ఎంతగానో మేలుచేశాయని, ప్రపంచ శాంతికి పంచశీల సూత్రాలను భారత దేశం ఇవ్వగలిగిందని కర్నూల్ బాలోత్సవం అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు అన్నారు. విద్యాలయాలను, శాస్త్రసాంకేతికరంగంలోని పరిశోధన కేంద్రాలు ఆధునిక దేవాలయాలుగా నెహ్రూ పేర్కొన్నారని గుర్తు చేశారు. భారత దేశాన్ని లౌకిక, సామ్యవాద దేశంగా ప్రపంచపటంలో ఉంచారన్నారు.

# లక్షదీపోత్సవం - పుష్కరిణి హారతి



మనగళం శ్రీశైలం : కార్తిక రెండవ సోమవారం సందర్భంగా ఈ రోజు (03.11.2025) పుష్కరిణి వద్ద దేవస్థానం లక్షదీపోత్సం మరియు పుష్కరిణిహారతిని నిర్వహిస్తోంది. లోకకల్యాణం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

లక్షదీపోత్సవం: ఈ దీపోత్సవ కార్యక్రమంలో పుష్కరిణి ప్రాంగణమంతా కూడా దీపాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

పుష్కరిణి హారతి : (దశవిధ హారతులు) ఈ రోజు సాయంత్రం (03.11.2025) గం. 6.30ల నుండి ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లకు మరియు పుష్కరిణికి దశవిధ హారతులు శాస్త్రోక్తంగా ఇవ్వబడుతాయి. కాగా ఈ కార్యక్రమానికి ముందుగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేబు చేయించి విశేషంగా పూజాదికాలు జరిపించబడుతాయి. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను ఇవ్వడం జరుగుతుంది. అనంతరం ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి,నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతి సమర్పించబడుతాయి.

టదశహారతులు - దర్శనఫలం1. ఓంకారహారతి : పరబ్రహ్మ స్వరూపమైన బీజాక్షరమే ఓంకారం. ఈ ఓంకారహారతిని దర్శించడం వలన కష్టాలన్నీ నివారించబడతాయి. సకల శుభాలు కలుగుతాయి. 2. నాగహారతి : ఈ నాగహారతిని దర్శించడం వలన సర్పదోషాలు తొలగిపోతాయి. సంతానం కలుగుతుంది. 3.త్రిశూలహారతి : ఈ త్రిశూలహారతిని దర్శించడం వలన అపమృత్యువు అంటే అకాలమరణం తొలగిపోతుంది. గ్రహదోషాలు నివారించబడతాయి. 4.నందిహారతి : ఈ నందిహారతిని దర్శించడం వలన భయం, దుఃఖము ఉండవు. ఆనందం, ఉత్సాహం లభిస్తాయి. 5.సింహహారతి :ఈ సింహహారతిని దర్శించడం వలన శత్రుబాధలు తొలగుతాయి. మనో ధైర్యం కలుగుతుంది. 6.సూర్య హారతి : ఈ సూర్య హారతిని దర్శించడం వలన ఆరోగ్యం చేకూరుతుంది. దీర్ఘాయుష్షు లభిస్తుంది. 7.చంద్రహారతి :ఈ చంద్రహారతి దర్శించడం వలన మనశ్శుద్ధి కలిగి, ఈర్ష్య, అసూయ ద్వేషాలు తొలగిపోతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. 8.కుంభహారతి : ఈ కుంభహారతిని దర్శించడం వలన కోరుకున్న కోరికలు నెరవేరుతాయి. సంపదలు కలుగుతాయి. 9.నక్షత్రహారతి :ఈ నక్షత్రహారతిని దర్శించడం వలన జాతక దోషాలు తొలగిపోతాయి. చేపట్టిన పనులలో విజయం లభిస్తుంది.


10. కర్పూరహారతి : ఈ కర్పూరహారతిని దర్శించడం వలన పాపాలన్నీ తొలగిపోతాయి. యజ్ఞఫలంతో పాటు అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయి.

# కార్యకర్తలకు అండగా ఉంటాం



మనగళం, కర్నూలు సిటీ : వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డిని స్వగృహం లో సోమవారం వైసీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి ఆరె.శ్యామల, రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరు వెంకట రెడ్డి, సీవీ రెడ్డి తదితరులు వివిధ అంశాలపై ఎస్వీ మోహన్ రెడ్డితో చర్చించారు. కర్నూలు నగరంలో చిన్నటేకూరు వద్ద ఇటీవల జరిగిన బస్సు దుర్ఘటనలో కూటమి ప్రభుత్వం అక్రమంగా 27మంది పై వైసీపీ నాయకులు, సోషల్ మీడియా వాళ్ళ పై కేసు నమోదు చేయడంపై వివరాలు సేకరించారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారించాలని ఈ సందర్భంగా వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కోర్టు ను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని నాయకులు తెలిపారు

# నీటి సమస్యలు ఉండకూడదు



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్యలు ఉండకూడదని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి తాగునీరు, శానిటేషన్, వ్యవసాయం, జిఎస్డబ్ల్యూఎస్ సర్వీస్ లు, పిజిఆర్ఎస్ తదితర అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్యల గురించి పత్రికల్లో వ్యతిరేక వార్తలు వస్తున్నాయని, అలా రాకుండా ముందుగానే సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యనిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపివో ను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) నుండి ప్రతిరోజూ జిల్లాల వారీగా పి.జి.ఆర్.ఎస్ అర్జీల పరిష్కారాన్ని పర్యవేక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు. అర్జీలకు సంబంధించి సమయం ఉందని నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, వచ్చిన వెంటనే చూడాలన్నారు.... జిల్లా అధికారులే అర్జీదారులతో నేరుగా ఫోన్ చేసి మాట్లాడాలని, అర్జిదారులకు ఎండార్స్మెంట్ ను వాట్సప్ ద్వారా పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్ కి సంబంధించి కర్నూలు ఆర్డీఓ 8, పత్తికొండ ఆర్డీఓ 7, ఆదోని సబ్ కలెక్టర్ 4, సర్వే ఏడి 2, కలెక్టరేట్ ఏ ఓ 2, జి జి హెచ్ 1, పిడి డి ఆర్ డి ఏ వద్ద 1, సివిల్ సప్లైస్ వద్ద 1 అర్జీలు పెండింగ్ లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవన శాఖలకు సంబంధించి రైతులకు ఎక్కడా నష్టం కలగకూడదని, ఎక్కడ ఏ సమస్య ఉందో తనకు ముందే చెప్పాలని కలెక్టర్ వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను ఆదేశించారు. చీడ పీడలు, పంట నష్టం, మార్కెటింగ్, రైతులకు సంబంధించి ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. పత్రికల్లో చూసి తెలుసుకునే విధంగా ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్రాప్ ఎన్యూమరేషన్, క్రాప్ బుకింగ్ పక్కగా జరగాలన్నారు. పత్తి కి సంబంధించి ప్రతి రోజు ధరలు ఎంత ఉన్నాయనే వివరాలు ఇవ్వాలని కలెక్టర్ మార్కెటింగ్ ఏడి ని ఆదేశించారు. రైతులు సహజ వ్యవసాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి..మంత్రి బీసీ



మన గళం బనగానపల్లె : రాష్ట్రం లోని ప్రజలు సుభిక్షంగా ,సంతోషంగా, అష్టైశ్వర్యాలతో ఉండాలని యాగంటి ఉమామహేశ్వర స్వామిని కోరుకున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోమవారం అన్నారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామి వారిని మంత్రి కుటుంబ సమేతంగా సోమవారం వేకువ జామున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగంటికి చేరుకున్న మంత్రి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదటగా ఆలయంలోని గణపతి విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం గర్భగుడిలో కొలువైన ఉమామహేశ్వర స్వామి నీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం ఎంతో విశిష్టత కలిగిన యాగంటి బసవన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు . కార్తీకమాస పర్వదినాన స్వామివారిని దర్శించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోనే అగ్రగామీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా భావించి ప్రజలకు సమపాలలో అందిస్తున్నట్లు అన్నారు.

# మానవత్వం చాటుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి





మన గళండోన్ కర్నూల్ జి ఆర్ సి ఫంక్షన్ హాల్ సమీపంలో బెంగళూరు నుంచి కర్నూల్ వస్తున్న ఓ వాహనం బోల్తా పడింది. అదే మార్గంలో వెళ్తున్న డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి తన వాహనాన్ని ఆపి వెంటనే అంబులెన్స్ కు ఫోన్ చేశారు. సంబంధిత వైద్యుడితో మాట్లాడి క్షత గాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. బాధితుల యోగా క్షేమాలను తెలుసుకొని మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ని అభినందించారు.

# సీసీ రోడ్ల పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



మన గళం , క్రిష్ణగిరి మండలంలోని పెద్దొడ్డి, ఆలంకొండ, కటారికొండ, బోయబొంతిరాళ్ల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాం కుమార్ గారు ప్రారంభించారు. అదే విధంగా కటారికొండ, బోయబొంతిరాళ్ల గ్రామపంచాయతీల నూతన భవనాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ు "ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడం మా ప్రభుత్వ లక్ష్యం. సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు గ్రామ అభివృద్ధికి దోహదం చేస్తాయి. ప్రజలు కోరిన ప్రతీ అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తాం" అన్నారు.

# కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ



కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా క్రిష్ణగిరి మండలంలోని చెరుకులపాడు గ్రామంలోని శివాలయాలలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శివాలయంలో అభిషేకం చేసి దీపారాధన చేశారు. భక్తులందరూ సుఖశాంతులు, ఆరోగ్యసంపదలతో ఉండాలని భగవంతుణ్ణి ప్రార్థించిన మాజీ ఎమ్మెల్యే గారు, ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గెలుపు దేశంలోని ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకం..మంత్రి బీసీ



మన గళం బనగానపల్లె : మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో భారత్ క్రికెట్ టీం విజయం సాధించడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాలు , పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం దేశంలోని ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది మహిళలు క్రీడల్లో రాణించి అంతర్జాతీయంగా భారత్ సత్తాను చాటాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# యర్రగొండపాలెం సిఐ అజయ్ కుమార్‌కు టిడిపి నాయకుల శాలువా సత్కారం




మన గళం ,దోర్నాల, నవంబర్ 3: ఇటీవల యర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కే. అజయ్‌కుమార్‌ను దోర్నాల మండల తెలుగు దేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు యాలకపాటి చెంచయ్య, ఉపాధ్యక్షులు సింగపోలు రాజు, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు వినుకొండ దివేనయ్య పాల్గొన్నారు. పోలీసులు ప్రజల కోసం చేస్తున్న సేవలను అభినందించిన టిడిపి నాయకులు, సిఐ అజయ్‌కుమార్ విజయవంతమైన పదవీకాలం కొనసాగాలని ఆకాంక్షించారు.

# విద్యుత్ అంతరాయం

మన గళండోన్ డోన్ నుండి బేతంచెర్ల నేషనల్ హైవే పనులు జరుగుతున్నందున 11 షిఫ్టింగ్ కారణంగా మంగళవారం డోన్ పట్టణంలోని కొండపేట,చాకిరేవుమిట్ట,గుత్తి రోడ్డు సిపిఐ ఆఫీస్, రైల్వే స్టేషన్, ప్రాంతాలలో మధ్యాహ్నం రెంమధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు ఉండదని విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వర రెడ్డి తెలియజేశారు.

# పీఎం సూర్య ఘర్ పథకంతో ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి**




మనగళం, నంద్యాల టౌన్ : పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా రూఫ్‌టాప్ ఉన్న ప్రతి ఇంటికి సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేయడం ద్వారా కుటుంబాలకు సుమారు 25 సంవత్సరాలపాటు ఉచిత విద్యుత్ లభించే అవకాశం ఉందని, ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జరిగిన ప్రజా పరిష్కార వేదిక అనంతరం, కలెక్టర్ పిఎం సూర్య ఘర్ పథకం అమలు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డీఆర్ఓ రాము నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్, డిప్యూటీ కలెక్టర్లు, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద రూఫ్‌టాప్ ఉన్న ప్రతి కుటుంబం ఇంటిపై సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉచిత విద్యుత్తుతో పాటు, ఉత్పత్తి అయిన అదనపు విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఆదాయాన్ని కూడా పొందవచ్చని వివరించారు. జిల్లాలో ఈ పథకం అమలుకు భాగంగా ఐదు మండలాల్లో ఐదు గ్రామాలను మోడల్‌గా ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సిరివెళ్ల మండలంలోని గోవిందపల్లె, వెలుగోడు మండలంలోని వేల్పనూరు, బనగానపల్లె మండలంలోని నందవరం, నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను, డోన్ మండలంలోని చిన్న మల్కాపురం... ఈ గ్రామాల్లోని ప్రతి ఇంటికీ రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేసే పనులను ఆరు నెలల కాలవ్యవధిలో 100% పూర్తి చేస్తే, సదరు గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం కోసం సంబంధిత మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ స్పెషల్ అధికారులు ప్రతి గ్రామాన్ని మోడల్‌గా మార్చే దిశగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు గృహ లబ్ధిదారులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందే సౌకర్యం కూడా అందుబాటులో ఉందని కలెక్టర్ వివరించారు. అధికారులు ప్రజలకు పథకం ప్రయోజనాలను వివరించి, ప్రతి ఇంటిని ఈ కార్యక్రమంలో భాగం చేసేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సూచించారు.

# పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు హోమ్ స్టే విధానం

**– నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి**




మనగళం, నంద్యాల టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం, పర్యాటకులకు బడ్జెట్-ఫ్రెండ్లీ వసతి సదుపాయాలు అందించడమే లక్ష్యంగా "హోమ్ స్టే", "బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్" విధానాలను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులు హోటళ్లలో కాకుండా స్థానిక ప్రజలతో కలసి సొంత ఇంటి వాతావరణంలో వసతి పొందే అనుభూతిని పొందేలా చేయడం, అలాగే తక్కువ ఖర్చుతో పరిశుభ్రమైన, నాణ్యమైన వసతి సదుపాయాలు అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఈ విధానం ద్వారా స్థానిక ప్రజలకు, ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్రంలోని హెరిటేజ్, గ్రామీణ, గిరిజన, దేవాలయ, నేచర్ టూరిజం రంగాల అభివృద్ధికి తోడ్పడుతుందని ఆమె పేర్కొన్నారు. హోమ్ స్టే లేదా బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ వసతి ఏర్పాటు చేయదలచిన యజమానుల కోసం పర్యాటక శాఖ మార్గదర్శకాలు విడుదల చేసినట్లు కలెక్టర్ చెప్పారు. యజమానులు తమ ఇంటిలో కనీసం ఒక గది నుండి గరిష్టంగా ఆరు గదుల వరకు పర్యాటకులకు అద్దెకు ఇవ్వవచ్చని, అయితే యజమాని తప్పనిసరిగా ఆ ప్రాంగణంలోనే నివసిస్తూ ఉండాలని చెప్పారు. పర్యాటకులకు ఎయిర్ కండీషనింగ్, టీవీ, ఇంటర్నెట్, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షిత తాగునీరు వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా అందించాలన్నారు. రిజిస్టర్ అయిన యజమానులకు విద్యుత్, వాటర్ ట్యాక్స్, ఇంటి పన్నులు మొదలైన వాటిపై సాధారణ వినియోగదారుల తరహాలో రాయితీలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. జిల్లా పర్యాటక కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు ఫారమ్ పొందవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు గుర్తింపు, చిరునామా రుజువులు, ఆస్తి యాజమాన్య పత్రాలు, స్థానిక అథారిటీ నుంచి ఎన్.ఓ.సి., ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్ వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

# ఆర్‌టిఓ కార్యాలయంలో డోన్, బేతంచెర్ల పరిధిలోని అన్ని పాఠశాలలు మరియు కళాశాలల బస్సు ఇన్‌చార్జ్‌లతో సమావేశం



మన గళండోన్ పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం నందు ఈరోజు సోమవారంరవాణా కమిషనర్, విజయవాడ ఆదేశాల మేరకు విద్యార్థుల భద్రతా చర్యలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించబడింది. సమావేశంలో స్కూల్ / కాలేజ్ బస్సుల భద్రతా తనిఖీలకు సంబంధించిన చెక్‌లిస్ట్ ఇవ్వబడినది.

తనిఖీ చెక్‌లిస్ట్‌లో ముఖ్య అంశాలు: అత్యవసర ద్వారం (%జుఎవతీస్త్రవఅఎ జుఞఈ) –% కనీసం ఒకటి తప్పనిసరి, లోపల మరియు బయట నుంచి సులభంగా తెరవడానికి అందుబాటులో ఉండాలి. స్పీడ్ గవర్నర్ %–% 60 కిమీ వేగానికి లాక్ అయ్యే విధంగా పనిచేయాలి. %ఖీణూూ (ఖీఱతీవ ణవ్‌వషఎశీఅ ఖఅ౦ ూౌ్రిఖతీఎఱఅస్త్ర ూఎర్‌వఎ) –% 01.04.2019 తరువాత తయారైన వాహనాల్లో ఉండాలి. %ఖీణూూ (ఖీఱతీవ ణవ్‌వషఎశీఅ ూబజూజూతీవంంఱశీఅ ూఎర్‌వఎ) –% 01.10.2023 తరువాత తయారైన బస్సుల్లో ఇంజిన్ మరియు ప్రయాణికుల విభాగాల్లో ఉండాలి. అగ్నిమాపక పరికరాలు (%ఖీఱతీవ జుఞఅఙస్త్రబఱఅస్త్రవతీం) –% కనీసం రెండు ఉండాలి మరియు పని చేసే స్థితిలో ఉండాలి. హ్యాండ్ బ్రేక్ మరియు సర్వీస్ బ్రేక్ %–% సక్రమంగా పనిచేయాలి. యాంబర్ ఫ్లాషింగ్ లైట్లు %–% బస్సు పైకప్పు నాలుగు మూలల వద్ద అమర్చాలి. ఈ అంశాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని తెలియజేయడం జరిగినది బస్సులను చెక్ లిస్ట్ ప్రకారం సరిచేసుకొనుటకు 10 రోజుల సమయం ఇవ్వడం జరిగినది.

# కార్తీకమాసోత్సవాలు

మనగళం శ్రీశైలం : కార్తీకమాసంలో రెండవ సోమవారమైన ఈ రోజు ( 03.11.2025) భక్తులు వేకువజాము నుండే అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శిస్తున్నారు. అలాగే వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించుకుని శ్రీస్వామిఅమ్మ వార్ల దర్శనార్థమై ఆలయానికి చేరుకుంటున్నారు. దర్శనం ఏర్పాట్లు కార్తీకమాసంలో ప్రభుత్వసెలవుదినాలు, కార్తీక సోమవారాలు మరియు కార్తీకపౌర్ణమి రోజులలో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకోవడం జరుగుతోంది. భక్తులందరు సంతృప్తికరంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది.

దర్శనం ఏర్పాట్లు

వేకువజామున 3గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రాత:కాలసేవలను జరిపించిన అనంతరం వేకువజామున గం. 4.30ల నుంచి సాయంత్రం గం. 4.00ల వరకు దర్శనాలను కొనసాగించాలన్నారు. అదేవిధంగా తిరిగి సాయంత్రం గం. 5.30ల నుంచి రాత్రి గం. 10.30ల వరకు దర్శనాలు కొనసాగుతాయి. అదేవిధంగా కార్తీకమాస రద్దీరోజులలో అనగా శని,ఆది,సోమవారాలు శుద్ధఏకాదశి, కార్తీక పూర్ణిమ మొదలైన రోజులు ( కార్తీకమాసములో మొత్తం 16 రోజులు) స్వామివారి స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేయబడింది. అదేవిధంగా ఈ రద్దీరోజులలో సామూహిక ఆర్జిత అభిషేకాలను కూడా నిలుపుదల చేయడం జరిగినది.

సిబ్బందికి ప్రత్యేక విధులు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకై దేవస్థానం శాఖాధిపతులకు, పర్యవేక్షకులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. దాదాపుగా కార్యాలయం సిబ్బంది అంతా కూడా ప్రత్యేక విధులను నిర్వర్తిస్తున్నారు.

క్యూలైన్లలో అల్పాహారం

కార్తీకమాసమంతా క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు అల్పాహారం మరియు మంచినీరు అందజేయబడుతున్నాయి. అలాగే ఈ ఉదయం నుంచే భక్తులకు వేడిపాలను కూడా అందజేయడం జరిగింది.

కార్తీకదీపోత్సవం

భక్తులు కార్తికదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీధి మరియు గంగాధరమండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది.

అన్నప్రసాద వితరణ

భక్తులకు అన్నదాన భవనములో ఉదయం 10.30 నుండి అన్నప్రసాదాల వితరణ చేయబడుతున్నాయి. అలాగే సాయంత్రం గం. 6.30ల నుంచి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయబడుతుంది.

లడ్డు ప్రసాదాలు

కార్తీకమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేయబడ్డాయి. మొత్తం 10 కౌంటర్ల ద్వారా ప్రసాదాలు అందజేయబడుతున్నాయి.

# ఇవీ చార్జింగ్ స్టేషన్ల స్థాపనకు అనువైన ప్రదేశాలను గుర్తించండి

**– నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి**




మనగళం, నంద్యాల టౌన్ : నంద్యాల పట్టణంలో ఇవీ చార్జింగ్ స్టేషన్ల స్థాపనకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయల వ్యయంతో దేశవ్యాప్తంగా ఇవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టిన నేపథ్యంలో, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఈ ప్రాజెక్టు అమలు కానుందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం కింద 100 శాతం సబ్సిడీతో చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పే అవకాశం ఉందని పేర్కొన్నారు. నంద్యాల పట్టణ పరిధిలో, జాతీయ రహదారుల వెంట, పబ్లిక్ ఉపయోగానికి అనువైన ప్రదేశాలలో 24 గంటల పాటు నిరంతరాయంగా పనిచేయగల స్టేషన్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలన్నారు. నెట్‌క్యాప్ సంస్థ ఈ ప్రాజెక్టును నిర్వహించబోతోందని, అవసరమైన వెరిఫికేషన్, అనుమతుల ప్రక్రియ పూర్తైన తర్వాత ఒక్కో చార్జింగ్ స్టేషన్‌ను సుమారు 35 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ నేపథ్యంలో 30%ఇ%40 మరియు 50%ఇ%60 పరిమాణాల స్థలాలను ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో గుర్తించి, వారం రోజుల్లో నివేదిక సమర్పించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుందని, కాలుష్యం తగ్గుతుందని, ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నెట్ క్యాప్ డెవలప్మెంట్ అధికారి డి. వీరేంద్ర బాబు ఇవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలను వివరించారు.

# పీజీఆర్ఎస్ వినతులు పరిష్కరించండి



**– పారిశుద్ధ్యం, తాగునీటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించండి**

**– కౌలు రైతులకు నష్టపరిహారం అందేలా నివేదికలు సిద్ధం చేయండి**

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో, నిర్ణీత కాల వ్యవధిలో, ప్రజలు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఆర్ఓ రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి, నాణ్యతతో నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాన్ కారణంగా పంటలు, మట్టి మిద్దెలు, మౌలిక వసతులకు జరిగిన నష్టాలపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను ప్రభావం కారణంగా పంటలకు గణనీయమైన నష్టం సంభవించిందని, ఇప్పటివరకు అందిన నష్ట నివేదికలను పరిశీలించి, ఇంకా పెండింగులో ఉన్న గ్రామాల పంట నివేదికలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందే విధంగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. తుపాను ప్రభావంతో పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్న మట్టి మిద్దెలలో నివాసముంటున్న కుటుంబాల వివరాలు ు ప్రతి సచివాలయం వారీగా బాధితుల ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా నంబర్, మరియు సంబంధిత వివరాలను నిర్ణీత ప్రోఫార్మాలో పొందుపరచి సమర్పించాలని ఆర్డీవోలు, తహసీల్దారులకు సూచించారు. అదేవిధంగా కెనాల్స్, వాగులు, వంకలు, చెరువులు వంటి నీటి వనరుల వద్ద గండ్లు పడి తాత్కాలికంగా కట్టడి చేసిన ప్రాంతాలను పరిశీలించి, శాశ్వత మరమ్మతులు చేపట్టే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపాలు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో, సంబంధిత సచివాలయ సిబ్బంది, సానిటేషన్ వర్కర్లు, ఈఓఆర్డీలు, పంచాయతీ మరియు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీరు కలుషితమవుతున్నట్లు పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

# అర్హులందరికీ న్యాయం చేస్తాం



మనగళం, కోడుమూరు : ఆవాస్ యోజన పథకానికి సంబంధించి అర్హులందరికీ న్యాయం చేస్తామని కోడుమూరు రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు బేస్త ఈరన్న తెలిపారు. ఈ మేరకు సోమవారం కోడమూరు బాలాజీ నగర్ లోని బీజేపీ కార్యాలయంలో ఆవాస్ యోజన పథకానికి సంబంధించి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోడుమూరు రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు బేస్త ఈరన్న మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఆవాస్ యోజన పథకాన్ని అర్హులందరికీ అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# సైబర్ క్రైమ్, మారకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు




మన గళం కోడుమూరు: యువత మారకద్రవ్యాలకు బానిసలు కాకుండా, సైబర్ మోసాల పై అప్రమత్తంగా ఉండాలని ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలిసా తెలిపారు. సోమవారం ఐజి ఆర్కే రవికృష్ణ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సాయిరాం, కె.వి.ఆర్ డిగ్రీ కళాశాల లో సైబర్ నేరాలు, మారకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు పోలీసు కళాబృందంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహనతో కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆధారం చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. మత్తు పదార్థాలు, సైబర్ మోసాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. వాట్సప్, ఫేస్బుక్ ఇతర యాప్లు, ఈ మెయిల్స్ తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. ఫోన్లో ఓటిపి, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీ అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్లకు స్పందించకూడదన్నారు సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు డయల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మణికంఠ, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 10వ తేదీన కర్నూలు నగరానికి వస్తున్న ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్ర సదస్సును జయప్రదం చేయండి



మన గళం కోడుమూరు: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈ నెల10 తేదీన కర్నూలు నగరానికి వస్తున్న ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్ర సదస్సును జయప్రదం చేయాలని ఈరోజు అఖిల భారత విద్యార్థి సమాఖ్య కోడుమూరు మండల సమితి ఆధ్వర్యంలో మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల %ఖూచీ=% జూనియర్ కళాశాల లో బస్సు యాత్ర జయప్రదం చేయాలని విద్యార్థుల తో కలసి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ

అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలోన రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు 6400 కోట్లు విడుదల చేయాలని పి.జీ. విద్యార్థులకి శాపంగా మారిన జీవో నెంబర్ 77ని రద్దు చేయాలని యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే విధానం పిపిపి విధానాన్ని రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలోన అక్టోబర్ 22 నుంచి నవంబర్ 12వ తేదీ వరకు ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు జరుగుతున్నటువంటి ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్ర నవంబర్ 9వ తేదీ సాయంత్రం కర్నూల్ నగరం చేరుకుంటుందని అందువలన నవంబర్ 10వ తేదీ కర్నూలు నగరంలో పెద్ద ఎత్తున విద్యార్థుల సదస్సు ఏర్పాటు చేయడం జరిగినదని కావున జిల్లా వ్యాప్తంగా పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఈ సదస్సుకు హాజరై సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్రంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం పేపర్ ప్రకటనలకు మాత్రమే పరిమితమై విద్య వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తుందని వందల మంది విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ లు లేక వారి సర్టిఫికెట్లను కళాశాలలోనే ఉంచి ఎటు చదువుకోలేక చదువులను మధ్యలోనే ఆపివేస్తా ఉన్నారని దీనివల్ల పేద మధ్యతరగతి విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయని దీనికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విడుదల చేస్తామని పేపర్ ప్రకటనలిచ్చి నెలలు గడుస్తా ఉన్న ఇప్పటిదాకా విడుదల చేయకపోవడం చాలా సిగ్గుచేటు అయినటువంటి విషయమని వారు ఈ సందర్భంగా తెలియజేశారు అదేవిధంగా పేద మధ్య తరగతి విద్యార్థుల వైద్య విద్య చదువుల కోరిక, కోరికగానే మిగిలే విధంగా ఉన్నటువంటి ప్రభుత్వ కళాశాలలను కూడా ప్రైవేట్ కళాశాలలుగా ప్రైవేట్ పబ్లిక్ పార్ట్నర్షిప్ అనే పేరు తోటి ప్రైవేట్ వ్యక్తులకి అప్పజెప్పడంతో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఇటువంటివి అనేకం చేస్తూ విద్యను ఏ మాత్రం పట్టించుకోకుండా ఉన్నటువంటి రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చే వరకు కళాశాల విద్యార్థులందరూ ఏకమై మరియు మెడికల్ విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యార్థులు పి.జీ. విద్యార్థులు ఏకమై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని కావున అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న సభ కు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని సభ ను జయప్రదం చేయాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కోడుమూరు మండల కార్యదర్శి ఎస్. అల్తాఫ్ బాషా మహేంద్ర సాయి తదితరులు పాల్గొన్నారు

# కోడుమూరు జి వి ఆర్ లో అట్టహాసంగా ముగిసిన పాఠశాల స్థాయి స్కిల్ కాంపిటీషన్







మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణం నందు గల జి వి ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోడుమూరు లో ఉండే పాఠశాల లో ఉండే ఐటీ- ఐటి ఈ ఏస్, బి ఎఫ్ ఏస్ ఐ, ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టు లకి సంబంధించి పాఠశాల స్థాయి లో నైపుణ్య పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులు చాలా వరకు అద్భుతమైన ప్రాజెక్టు లను తయారు చేయటం జరిగింది. ఇందులో ఐటి ట్రేడ్ లో ఫేషియల్ రికగ్నేషన్ కోడింగ్, బల్క్ ఐడి కార్డ్స్ మరియు ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ లో రైన్ డిటెక్టర్, ఎర్త్ కేక్ డిటెక్టర్ మరియు బ్యాంకింగ్ ట్రేడ్ లో సెక్యూరిటీ లేయర్స్ ఇన్ ఎ బ్యాంక్ వాల్ట్, మిని ఏటీఎం ప్రాజెక్టు లు ఆకట్టుకున్నాయని, వాటినే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ జె రామచంద్రుడు తెలిపారు. ఇందుకు సహకరించిన వృత్తి విద్య ఉపాధ్యాయులు యం. భీమ శేఖర్, యం. ఆంజనేయులు, యస్. ఇబ్రహీం లకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నందీశ్వరస్వామివారికి విశేషపూజలు



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం త్రయోదశిని పురస్కరించుకుని ఈ రోజు ( 03.11.2025) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# కోడుమూరులో ఇంటి స్థలాలు, ఇల్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి పక్క గృహాలు నిర్మించాలి: సిపిఎం డిమాండ్



మన గళం కోడుమూరు: సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు గఫూర్ మియ ఆధ్వర్యంలో కోడుమూరులో ఉన్నటువంటి పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని వారన్నారు గఫూర్ మియ మాట్లాడుతూ కోడుమూరు టౌన్ లో దాదాపు 50 వేల జనాభా నివాసంటున్నారు ఇందులో మెజారిటీగా భవన నిర్మాణ కార్మికులు చేనేత కార్మికులు ఉన్నారు వీరంతా కష్టపడి పని చేస్తే నే కుటుంబాలు గడుస్తాయి వచ్చిన కూలీలతో ఇంటి అద్దెలు కట్టుకోలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు గత ప్రభుత్వంలో కోడుమూరుకు సంబంధించిన పేదలకు వెంకటగిరి గ్రామం నందు ఉపయోగము లేని చోట కొండమీద ఇంటి స్థలాలు ఇచ్చారు అందులో ఎలాంటి వసతులు లేని చోట కొండపై గృహాలు నిర్మించుకోవాలంటే ఇబ్బందులు వస్తాయని అక్కడ గృహాలు నిర్మించడానికి ఎవరు సాహసించలేదు ప్రజలకు అనువైన చోట ఇంటి స్థలాలు ఇస్తే ప్రజలు ఇల్లు కట్టుకోవడానికి సాహసిస్తారు కర్నూల్ రోడ్డు గానీ గూడూరు పత్తికొండ ఎమ్మిగనూరు వెల్దుర్తి రోడ్ల లో గాని గ్రామానికి దగ్గర ఉన్నచోట ఇంటి స్థలాలు ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రజలకు పంచితే ఉపయోగంగా ఉంటుంది గత 25 సంవత్సరాల నుండి ఏ ప్రభుత్వం గానీ కోడుమూరులో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వలేదు ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వమైన ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కోడుమూరు ప్రజలకు అనువైన చోట ఇంటి స్థలాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు గతంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇంటి స్థలాల కొరకు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేయడం జరిగింది ఇప్పుడు కూడా ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి స్థలాలు మరియు పక్క గృహాల కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సిన పరిస్థితి వస్తుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఎందుకంటే కోడుమూరు పట్టణంలో పరిశ్రమలు గానీ మరి ఇతర ఆదాయాలు సమకూర్చే కంపెనీలు కానీ ఏమీ లేవు మొత్తం చేతి కష్టంతోనే పనిచేసే కుటుంబాలని పోషించుకోవాలి . అలాంటి పేద కార్మికులు కనీసం మూడు సెంట్లు జాగా ఉండి ఒక చిన్న ఇల్లు కట్టుకుంటే ఆ కుటుంబం బ్రతకడానికి ఇబ్బంది లేకుండా ఉంటుంది కావున అధికారులు ప్రజాప్రతినిధులు పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని అనువైన చోట ఇంటి స్థలాలు ఇచ్చి పక్క గృహాలు నిర్మించాలని ఆయన అన్నారు అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ కృష్ణమూర్తి కి అందజేయడం అయినది ఈ కార్యక్రమంలో జిపి వీరన్న కుమారస్వామి బుడ్డప్ప బండ శేఖర్ చిన్న వీరన్న పుండరీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# కర్నూల్ సిటీ రైల్వే సమస్యలు పరిష్కరించాలి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగర ప్రజల సౌకర్యార్థం రైల్వే సమస్యలు పరిష్కరించకపోతే రైళ్లను స్తంభింప చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మల కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కర్నూల్ నుండి విజయవాడకు ఇంటర్సిటీ నడపాలని, ఆగిపోయిన మచ్చులు పట్నం రైలును కొనసాగించాలని, రైల్వే వాకింగ్ వర్క్ షాప్ పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పించాలని, కొత్త రైల్వే లైన్లు వేయాలని సీపీఎం నగర కమిటీలు నవంబర్ ఒకటో తేదీ నుండి 48 గంటలు దీక్షలు అనంతరం మహా ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత 2015 నుండి కర్నూలు నగరానికి రైల్వే సౌకర్యాలు కల్పించాలని అనేకసార్లు కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి మొరపెట్టుకున్న ఏ మాత్రం కదలిక కూడా లేకపోవడం దుర్మార్గమన్నారు. ఒకప్పటి రాజధాని నిర్లక్ష్యానికి గురవుతుంటే అక్టోబర్ 16న నరేంద్ర మోడీ సభ నిర్వహించి ఇక్కడ ఎన్నికైన పార్లమెంటు సభ్యులు నాగరాజ్, శాసనసభ్యులు, పారిశ్రామిక మంత్రి టీజీ భరత్ ఎందుకని కర్నూల్ రైల్వే అభివృద్ధి, సమస్యల గురించి మోడీకి వివరించలేదని ప్రశ్నించారు. రైల్వే వేగన్ నిర్మాణం పూర్తయితే 5,000 మంది యువతకు ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. అలాగే గుంటూరు వరకు నడుస్తున్న కాచిగూడ ఎక్స్ప్రెస్ లను విజయవాడ వరకు పొడిగించాలని, తుంగభద్ర కర్నూల్ శ్రీశైలం వరకు రైల్వే ట్రాక్ నిర్మాణం చేపట్టాలని, కర్నూలు ఓర్వకల్లు నంద్యాల రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని చేపట్టాలని, డోన్ నుండి మహబూబ్నగర్ వరకు డబల్ ట్రాక్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డబల్ ఇంజన్ సర్కార్ రద్దు చేసిన మచిలీపట్నం, విశాఖపట్నం డబల్ రైళ్లను పునరుద్ధరించి డైలీ ట్రైన్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి కర్నూలు నగర ప్రజల రైల్వే సమస్యలు స్టేషన్ మాస్టర్ ద్వారా పంపిస్తున్నామని, కేంద్రం స్పందించకుంటే రాబోయే కాలంలో ప్రజలను సమీకరించి రైల్వేలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్టేషన్ మాస్టర్ కి నాయకులు వినతి పత్రం అందించారు. ప్రజానాట్యమండలి బృందం ప్రజల సమస్యలపై పాటలను ఆలపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్ అలివేలు, నగేష్, విజయ, రామాంజనేయులు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు, సిహెచ్ సాయి బాబా, సుధాకరప్ప ,నరసింహులు, కే ప్రభాకర్, అబ్దుల్ దేశాయ్, రామకృష్ణ, షరీఫ్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, అరుణ, జిల్లా నాయకులు పద్మ, రత్నమ్మ కుమారి,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా ఉశేన్ భాషా,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయి, ఉదయ్, రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఆటో యూనియన్ నగర కార్యదర్శులు రాధాకృష్ణ, మహముద్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ జి కృష్ణ, పెదబాబు, నగర కార్యదర్శి భాస్కర్, చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు మహమ్మద్ రఫీ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి ఏసు.శంకర్, ఖాజా బాషా తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిట కల్పతరువు.. సీఎం రిలీఫ్ ఫండ్

**– మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**



మనగళం, బనగానపల్లె : కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదల పాలిట వరంగా మారిందని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు రూ. 25,98,124 చెక్కులను మంత్రి చేతులు మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ కొండంత భరోసానిస్తోందన్నారు. నిరుపేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కుటుంబ పెద్ద అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం అప్పుల వలలో చిక్కుకోకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటుందన్నారు. చెక్కుల పంపిణీ సందర్భంగా వైద్య సహాయం అందుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని.. వారి యోగక్షేమాలను మంత్రి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధితులు తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, మంత్రికి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (02.11.2025) శ్రీ బి.కె. గీతాంజలి, కర్నూలు వారిచే కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.

ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యకార్యక్రమం ఏర్పాటు చేయబడింది.

ఈ కార్యక్రమములో మూషికవాహన, గజవదన వేడువే, ఓం నమశ్శివాయ, జయ జయ దుర్గే, ఈశ్వరా పరమేశ్వరా తదితర గీతాలకు, అష్టకాలకు విష్ణుప్రియ, గీతాశ్రీ, లక్ష్మీ సృజన, అక్షయ, తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు.

కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.

శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# దేవదేవునికి పల్లకీ ఉత్సవం ఉత్సవం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (02.11.2025) రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తుంది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.





# పంట కోత ప్రయోగంతో దిగుబడి అంచనా వేయవచ్చని పేర్కొన్న కోడుమూరు ఎం ఏ ఓ



మన గళం కోడుమూరు: పంట కోత ప్రయోగం ద్వారా పంట దిగుబడి అంచనా వేయవచ్చని మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గోరంట్ల గ్రామంలో సాగు చేసిన వేరుశనగ పంటలో ఎంఏఓ రవి ప్రకాష్ పర్యవేక్షణలో పంట కోత ప్రయోగం చేశారు. గోరంట్ల గ్రామానికి చెందిన ఉమాదేవి అనే రైతు సాగుచేసిన వేరుశనగ పంటలో పంట కోత ప్రయోగంలో 5 మీటర్ల వెడల్పు , 5 మీటర్ల పొడవు పంట కోత ప్రయోగంలో 2.100 కిలోల దిగుబడి వచ్చిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏఈఓ బాలకృష్ణ, వి ఏ హెచ్ హరి ప్రసాద్, వి ఏ ఏ సుబ్రహ్మణ్యం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు



మనగళం శ్రీశైలం : లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (03.11.2025) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి.

శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంయి.


Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310